డాక్టర్ విశాల్ బిగ్గరగా నవ్వాడు "అవును. మేం చేసేది అదే. రకరకాల పరీక్షలకీ, రిపోర్ట్లకీ వేలకి వేలు ఖర్చవుతాయి. ఛాన్సు పాతికశాతం కూడా వుండదు. మా పద్ధతిలో భార్యాభర్తలకి  అనుమానం రాదు. నా ఫోటోలు ఇళ్ళల్లో పెట్టుకుంటారు. చిన్న వీర్యం మార్పిడితో ఎందరికో నేను దేవుణ్ణి అయ్యాను".

"అవును. నీ కాంపౌండర్లని వాళ్ళకి భర్తల్ని చేసి " కసిగా అన్నదే కానీ మధూహలో అలజడి మొదలైంది. ఇన్స్పెక్టర్ ఇంకా రాలేదు. కారణం తెలీదు.

"మధూ ఈ విషయం ఇక్కడే మర్చిపో. నీ మంచికోసమే చెపుతున్నాను" అన్నాడు రాజు హెచ్చరికగా.

"మర్చిపోకపోతే?"

"నన్ను వదులుకోవలసి వస్తుంది" కటువుగా అన్నాడు.

"ఇంత జరిగాక నిన్ను వదలకుండా వుంటానని ఎలా అనుకున్నావ్ రాజూ? కళ్ళు పోయి అంధుడివైనప్పుడు నాకెందుకు చేరువయ్యావో ...... డాక్టర్ విశాల్తో చెపుతూండగా విన్నాను. ఇప్పుడు నేను చెపుతున్నాను విను. ఇంకో అయిదునిముషాల్లో ఈ థియేటర్నుంచి బయటకు వెళ్ళగానే నేను ప్రెస్కాన్ఫరెన్స్ పెట్టి విశాల్ సంతానోత్పత్తి కేంద్రాల ...... హిప్నాటిజం మోసాల్ని బయటపెట్టబోతున్నాను".

విశాల్ బిగ్గరగా నవ్వుతూ "ఎవరు నమ్ముతారు? పత్రికలమీద పరువునష్టం దావా వేస్తాను. నీ దగ్గిర ఏ సాక్ష్యముందని ...... " అనబోతూ హఠాత్తుగా ఆగిపోయాడు. చప్పున రాజు వైపు తిరిగి "...... సెర్చ్ హర్ " అన్నాడు.

మధూహ ఆఖరిప్రయత్నంగా బెల్ స్విచ్ గట్టిగా నొక్కింది. అప్పటికే రాజు దగ్గిరగా వచ్చి, దిండుక్రిందనుంచి కాలింగ్బెల్నీ, టేప్రికార్డర్నీ తీశాడు.

విశాల్ కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి "చాలా సరంజామాతో వచ్చావే, పాములాంటిది" అని అంటున్నాడు.

రాజు మధూహ చెంపమీద బలంగా సాచికొట్టాడు. ఆమె కళ్ళనీళ్ళు గిర్రున తిరిగాయి.

విశాల్ రికార్డర్‌లోంచి క్యాసెట్‌తీసి, ఆపరేషన్‌కి వుపయోగించే ఫోర్‌సెప్స్‌తో టేప్ బయటికి లాగసాగాడు. మధూహకి నిస్సహాయతతో కూడిన నిస్సత్తువ ఆవరించింది.

అయిపోయింది. ఇంతకాలం పడిన శ్రమ అంతా వృధా అయిపోయింది.

తనకే సంబంధమూ లేకపోయినా, తనకే నష్టమూ జరగకపోయినా ...... ఒక సామాజిక దురన్యాయాన్ని ఎదుర్కోవటానికి ఇంత పనిచేస్తే చివరికి ఇలా అయింది.

ఒక్కటే ఆశ

ఇన్‌స్పెక్టర్ ఏమయ్యాడు?

ఆమె ఆలోచించటం మానేసింది.

ఈ లోపులో టేప్ అంతా బయటకి లాగి, సింక్‌లోని నీళ్ళలో పడేశాడు విశాల్.

మధూహ వైపు తిరిగి నవ్వాడు. ఆ నవ్వు వికృతంగా , భయంకరంగా వుంది.

మధూహ వెన్నులో చలి పుట్టింది.

“డాక్టర్ విశాల్ శత్రువుల్ని అంత మామూలుగా వదలడు. చెప్పు. నీకు ఏశిక్ష విధించమంటావ్?” అన్నాడు.

మధూహ భయభ్రాంతురాలై చూస్తోంది.

“యూట్రెస్ తీసెయ్యనా?”

మధూహ సన్నగా వణుకుతోంది. మనుష్యుల్లో ఇంత శాడిస్ట్‌లని చూడటం అదే ప్రధనం.

"రాజు" పిల్చాడు విశాల్. "నీ ఒకప్పటి ప్రియురాల్ని శాశ్వతంగా గొడ్రాల్ని చేస్తే నీకేమయినా అభ్యంతరమా? స్త్రీత్వాన్ని తొలిగిస్తే అబ్జెక్షనా?" .

మధూహ ఆకులా కదిలిపోయి "నో ...... నో " అరవబోయింది.

నోట మాట రాలేదు.

"ఆమెని పట్టుకో రాజూ! మత్తు కూడా ఇవ్వొద్దు. అలాగే ఆపరేషన్ చేసేద్దాం. హిస్టెరెక్టమీ ...... కొద్దిగా బాధగానే వుంటుందనుకో. కానీ ఎంత అరచినా బయటకు వినపడదు. ఆపరేషన్ థియేటర్ కదా ...... " నవ్వాడు.

రాజు ఆమెని టేబిల్‌కి అదిమిపెట్టి పట్టుకున్నాడు. ఒకప్పుడు 'ఐలవ్యూ' అన్న చేతులవి.

తనని పెనవేసిన చేతులవి. ముంగురులు నిమిరినవి.

ఆమె మనసు రాటు దేలిపోయింది.

అరిచే ప్రయత్నం కూడా చేయలేదు.

ఇన్‌ఫాక్చుయేషన్ వయసులో ఆకర్షణని ప్రేమ అనుకున్నందుకు ...... తప్పు ఎంపిక చేసుకున్నందుకు ...... తనకి అది శిక్ష అని మాత్రం అనుకుంది.

డాక్టర్ విశాల్ ఆపరేషన్ పరికరాల్తో ఆమె కాళ్ళ దగ్గిరని లబడ్డాడు. రాజు ఆమెని గట్టిగా పట్టుకుని వున్నాడు. డాక్టరు పొత్తికడుపు భాగాన ఇన్‌సర్షన్ మొదలు పెట్టబోయాడు.

అప్పుడు వినిపించింది తలుపు కొట్టిన చప్పుడు. మధూహ గాఢంగా శ్వాస తీసుకుంది. విశాల్ తలుపు వైపు అనుమానంగా చూస్తూ "ఎవరదీ?" అన్నాడు.

“ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్” బయట్నుంచి వినపడింది.

ఇద్దరూ మొహాలు చూసుకున్నారు “అతనెందుకు వచ్చాడు?” స్వగతంగా ప్రశ్నించాడు విశాల్.

“నేనే తీసుకొచ్చాను” అంది మధూహ “ ...... మీ ఆటలు కట్టించటానికి ”.

విశాల్ కామ్‌గా “వెళ్ళి తలుపు తీయి రాజూ” అని , మధూహ వైపు తిరిగి “ ...... ఇప్పటివరకూ జరిగింది ఒక్క విషయం బయటకు రాకూడదు. గుర్తుంచుకో. తరువాత నిన్ను దేవుడు కూడా రక్షించలేడు” అన్నాడు.

భైరవమూర్తి లోపలికి వచ్చాడు.

డాక్టర్ విశాల్ అతడితో “ఇప్పుడే ఆపరేషన్ ప్రారంభించబోతున్నాను. ఏమిటంత అర్జెంటు పని ఇన్‌స్పెక్టర్?”అన్నాడు.

భైరవమూర్తి నవ్వాడు “నా ముప్పై ఏళ్ళ సర్వీసులో ఇలాంటి దబాయింపులు చాలా చూశాను డాక్టర్! క్యాసెట్‌లో నుంచి తీసేసినా టేప్ పాడవదు. అదీ, మధూహ సాక్ష్యం ...... ఈరెండూ చాలు కనీసం ఏడేళ్ళు నిన్ను కటకటాల వెనక్కి తోయటానికి”.

మధూహ గుండెల్నిండా శ్వాస తీసుకుంది. అప్పటివరకూ వున్న టెన్షన్ తగ్గింది.

“కానీ టేప్‌రికార్డర్ సాక్ష్యం ఆధారంగా కోర్టు శిక్ష వేయదు ఇన్‌స్పెక్టర్”.

“కానీ, జనం నమ్ముతారు. వాస్తవం వాళ్ళకి తెలుస్తుంది. నేనూ మధూహ సాక్ష్యం చెపుతాం. అది చాలు కదా నువ్వు సమూలంగా నాశనం అవటానికి”.

“కేసు ఎలాగూ నిలవనప్పుడు మీకేమిటి ఇందులో ఇంటరెస్టు?”.

భైరవమూర్తి పక్కనున్న టేబిల్ దగ్గిరకు లాక్కుని కూర్చుంటూ "మూడు లక్షలు ఇవ్వండి. ఇదంతా మర్చిపోతాను" అన్నాడు.

మధూహ దిగ్భ్రాంతురాలై చూసింది. తను వింటున్నది నిజమేనా అన్న అనుమానం కలిగింది ఆమెకు.

"ఒక్కనిముషం టైమిస్తున్నాను. ఆలోచించుకుని చెప్పండి. మీరొప్పుకోకపోతే నాకొచ్చే నష్టం ఏమీలేదు. మిమ్మల్ని ఇప్పుడే అరెస్ట్ చేసి తీసుకెళ్తాను. అమ్మాయికి సంబంధించినంతవరకూ నాకన్నా మీరే ఎక్కువ శత్రువులు. కాబట్టి నాగురించి కాకపోయినా, కనీసం మీ గురించైనా కోర్టులో సాక్ష్యం చెపుతుంది. ఏం? అంతేనా?".

మధూహ ఇంకా షాక్‌నుంచి తేరుకోలేదు. ఫిర్యాదు చేసినవాడికే నమ్ముకున్న న్యాయస్థానం ఉరిశిక్ష విధిస్తే అతడెలా నిర్వీర్యుడవుతాడో ...... అలా వుండిపోయింది.

డాక్టర్ విశాల్ తెలివితక్కువ వాడేమీ కాదు. ఈ కేసు కోర్టుకెళ్ళి పేపర్లలో ఆ వార్త వచ్చి, అందరికీ వివరాలు తెలిస్తే ...... దాని పరిణామాలు ఎలా వుంటాయో ఊహించగలడు.

"లక్ష ఇస్తాను"

"రెండు లక్షలు ...... " ఇన్‌స్పెక్టర్ అన్నాడు.

విశాల్ ఇవ్వనన్నట్టు అడ్డంగా తలూపాడు.

భైరవమూర్తి ఒక క్షణం ఆలోచించి ...... "లక్షా యాభైవేలు. అదే ఫైనల్ " అన్నాడు.

ఒక్క క్షణం అక్కడ నిశ్శబ్దం.

"వారంలోగా సర్దుతాను"

"రేపటిలోగా సర్దాలి. ఆ తరువాత కేసు రాస్తే బాగోదు".

తప్పదన్నట్టు విశాల్ తలూపాడు.

భైరవమూర్తి రాజువైపు తిరిగి "నువ్వో క్షణం బయటకెళ్ళు " అన్నాడు.

రాజు ఏదో అనబోయి మనసు మార్చుకుని వెళ్ళిపోయాడు.

"ఇతడిని ఎంతవరకూ నమ్మొచ్చు?" రాజు వెళ్ళినవైపే చూస్తూ అడిగాడు భైరవమూర్తి.

"అతడు నా అసిస్టెంటు"

"కానీ కళ్ళు పోయినప్పుడు పదిహేనువేల కోసం నిన్ను బ్లాక్ మెయిల్ చేసాడు. ఈ అమ్మాయిని ముందు ప్రేమించానన్నాడు. తరువాత నీకోసం వదిలేశానన్నాడు. కళ్ళు పోగానే మళ్ళీ ప్రేమన్నాడు. ఇప్పుడు తిరిగి నీవైపు వచ్చేశానంటున్నాడు. ఇలాటి వాళ్ళని నమ్మటం కష్టం. క్రిమినల్స్‌తో నాకున్న కాంటాక్టుని బట్టి చెపుతున్నాను ...... ".

"మరేం చేద్దాం?"

"వీళ్ళిద్దర్నీ విడగొట్టాలి ...... "

"ఎందుకు?"

"ఈ అమ్మాయి చాలా అందంగా వుంది. ఎప్పటికయినా అతడిని వల్లో వేసుకుంటుంది. నిన్ను బ్లాక్ మెయిల్ చేస్తారు. అందుకే ఈ అమ్మాయిని అడ్డు తొలగించుకోవాలి"

ఉరితీతకు సిద్ధమైన ఖైదీముందు తలారీ, జైలరూ మాట్లాడుకుంటున్నట్టు వారిద్దరూ ఆమెని ఎలా చంపాలా అని మాట్లాడుకుంటున్నారు.

మధూహ దిగ్భ్రాంతితో చూస్తోంది.

"ఆపరేషన్ జరుగుతున్నప్పుడు ఈమె చచ్చిపోయినట్టు రికార్డు సృష్టించటం కష్టం కాదు" అన్నాడు విశాల్.

మధూహ హఠాత్తుగా అక్కణ్ణుంచి లేచి తలుపు వైపు పరుగెత్తబోయింది.

భైరవమూర్తి కాలు అడ్డుపెట్టాడు. పడబోయినదాన్ని పట్టుకున్నాడు. ఆమెని గట్టిగా అదిమిపెట్టి ...... "చాలా బావుంది శరీరం ...... రిటైర్ అవబోతున్న వాడిని ...... నాకే ఆవేశం కలిగిస్తోంది " అని విశాల్ వైపు తిరిగాడు.

"మీరీ అమ్మాయికి హిస్టెరెక్టమీ చేద్దామనుకుంటున్నారు కదూ".

"అవును "

"దానికన్నా అనుభవించటం మంచిది కదా"

డాక్టర్ విశాల్‌లాంటి శాడిస్టు కూడా విస్తుబోయి చూశాడు. భైరవమూర్తి నవ్వాడు. "అవును. యూట్రెస్‌ని తీసెయ్యటం కన్నా అనుభవించటం మంచిది కదా అంటున్నాను" అన్నాడు.

విశాల్ మధూహ వైపు పరిశీలనగా చూశాడు.

"ఎలాగూ చంపదల్చుకున్నప్పుడు ...... ఒకసారి ఇద్దరం అనుభవించి చంపుదాం ఏం? రాజు ఏమన్నా ఫీలవుతాడని నీకు భయమా?".

"రాజు సంగతి నాకు బాగా తెలుసు. డబ్బుముందు అతడికి ఏదీ ఆగదు. అదీగాక ఈ అమ్మాయిలో అతడు చూడనిది ఏదీ మిగల్లేదు " అంటూ మధూహని పట్టుకున్నాడు విశాల్.

కాపలాగా వుండటం కోసం ......భైరవమూర్తి బయటకు నడిచాడు. అతడి వెనుకే తలుపు మూసుకుపోయింది.

మధూహ విశాల్ చేతుల్లో గింజుకోసాగింది. విశాల్ మొహం వికృతంగా మారింది. రాక్షసబలంతో ఆమెని వివస్త్రని చేయటం ప్రారంభించాడు. ఆమె ప్రతిఘటిస్తోంది. కానీ బలం చాలటం లేదు. అందులోనూ, అప్పుడే కాంపోజ్ ఇంజెక్షన్ ఇవ్వబడిందేమో, శరీరం తూలుతోంది. అయినా సరే ...... అతన్నించి తప్పించుకోవటం కోసం సర్వశక్తులూ కూడగట్టుకొంటోంది.

అతడి మొహాన్ని రక్కేసింది. చొక్కా చిరిగిపోయింది. కానీ ప్రతిఘటించే కొద్దీ అతడిలో పశుబలం ఎక్కువ అవుతోంది.

ఆమె గౌను దాదాపు వూడిపోయింది. చేతుల్లోకి బలం తెచ్చుకుని, అతడిని విసురుగా తోసేసి తలుపువైపు పరుగెత్తింది. అయితే ఆమెకన్నా ముందే అక్కడికి చేరుకున్న విశాల్ తలుపు గడియ పెట్టేశాడు.

ఆమెని రెండుచేతుల్తోనూ ఎత్తి ఆపరేషన్ టేబిల్ మీద పడేశాడు. ఆమెకు స్పృహ తప్పుతూండగా, నిస్సహాయమైన స్థితిలోవున్న ఆమెని ఆక్రమించుకోసాగాడు.

ఆపరేషన్ గౌను ఎప్పుడో నేలమీదకు జారిపోయింది. నగ్నంగావున్న ఆమె శరీరంమీద అతడి నఖక్షతాలు, మెడచుట్టూ దంతక్షతాలూ రూపుదిద్దుకోసాగాయి.

అయిపోయింది.

అంతా అయిపోయింది.

ఒక సామాజిక దురన్యాయాన్ని ఎదుర్కొనే యజ్ఞంలో తనే సమిధ అయిపోయింది.

ఒక కన్నీటి చుక్క చెక్కిలిమీద జారుతుండగా, సత్తువ కోల్పోయి అతడికి లొంగిపోతూన్న తరుణంలో ......

హఠాత్తుగా పెద్దశబ్దం వినిపించింది.

అద్దం పగిలిన శబ్దం.

ఆపరేషన్ థియేటర్ "సీల్డ్" కిటికీ తాలూకు అద్దం అది.

పెంకులు గది లోపలికి చెల్లాచెదురుగా వచ్చిపడ్డాయి.

మధూహ మీదున్న విశాల్ తలెత్తి అటువైపు చూశాడు.

మళ్ళీ ఇంకో శబ్దం. పిస్తోలు పేల్చినట్టు.

పగిలిన కిటికీ అద్దాల సందుగుండా పిస్తోలు లోపలికి పెట్టి పేల్చారెవరో. మధూహ అతికష్టంమీద తల తిప్పి చూసింది. కిటికీ అవతల భైరవమూర్తి మొహం కనిపించింది.

మెడమీద తడి తగిలేసరికి మధూహ అప్రయత్నంగా తడిమి చూసుకుంది. జిగటగా ...... ఎర్రగా ...... రక్తం ...... ఒక్కోబొట్టే మెడమీద పడుతోంది.

విశాల్ రెండుకనుబొమ్మల మధ్య బొట్టు పెట్టినట్టు ఎర్రటిగాయం ......

అప్పటికే అతడి తల వాలిపోయింది. ఆమె తోసేసరికి అతడి శరీరం ఆపరేషన్ బల్ల పక్కనే దబ్బుమని శబ్దం చేస్తూ క్రిందపడింది. కొనప్రాణంతో కొట్టుకుంటున్నాడు.

ఏం జరిగిందో ఆమెకి అర్థం కాలేదు. ఈ లోపులో ఆపరేషన్ థియేటర్ బయట్నుంచి తలుపుని బలంగా తన్నారెవరో. గడియ వూడి తలుపు ధడాలున తెరుచుకుంది.

ఆమెకు ముందు కనపడింది భైరవమూర్తి.

వెనుక ...... చేతులకి సంకెళ్ళతో రాజు. అతడి వెనుక పోలీసులు!

మధూహ ఇంకా అయోమయం నుంచి తేరుకోలేదు.

భైరవమూర్తి లోపలికొచ్చి, గౌను తీసి ఆమె మీద కప్పాడు. అది అతడు చేసిన మొదటిపని.

"వాడిని తీసుకెళ్ళి వ్యాన్‌లో కూర్చోపెట్టండి " పోలీసులకి ఆజ్ఞ ఇచ్చాడు.

"ఇది అన్యాయం. అన్యాయం. నాకేమీ తెలీదు. లోపల ఏం జరిగిందో నాకు తెలీదు " అరుస్తున్నాడు రాజు.

భైరవమూర్తి అతడి దగ్గిరగా వెళ్ళి దవడమీద ఫెడేల్మని కొట్టాడు. " ...... మీ క్లినిక్‌లో పరీక్ష కోసం వచ్చిన వ్యక్తిమీద జరిగిన అత్యాచారంలో ? నీమీద అదీ  కేసు" అన్నాడు కర్కశంగా.